

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

## ప్రగతే లక్ష్యం.. సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్, డిసెంబర్ 19: ప్రగతే లక్ష్యం, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో తాసీల్దార్ మతిన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీలక్ష్మి, కార్పొరేటర్లు శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, లావణ్య సతీశ్ గౌడ్, సతీశ్ కుమార్, శారదామనోహర్‌రెడ్డి, రవి, లక్ష్మి, చిత్రాసుబ్రహ్మణ్యం, శాంతికోటేశ్‌గౌడ్, నిహారికగౌడ్, కోఆప్షన్‌సభ్యులు, సీనియర్ నాయకులు వెంకన్న, బాల్‌రాజ్, అహ్మద్‌పాషా, సాధిక్ పాల్గొన్నారు.

## వితంతు, వారి కుమార్తెల వివాహాలకు ఆర్థిక సాయం

- దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ముత్తూట్ ఫైనాన్స్

సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): వితంతు, వారి కుమార్తెల వివాహాలకు ఆర్థికసాయం చేసేందుకు ముత్తూట్ ఫైనాన్స్ ముందుకు వచ్చింది. దేశంలో అతిపెద్ద గోల్డ్ లోన్ కంపెనీ అయిన ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వివాహసన్మానం అనే ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపింది. ఇందులో భాగంగా వితంతువులైన తల్లులకు వారి కుమార్తెల పెండ్లి కోసం ఆర్థిక సహాయం అందించడానికి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు రూ.50వేల సాయాన్ని పొందనున్నారు. బెంగళూరు, హైదరాబాద్, మధురై, మంగళూరు, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ వంటి ఒక్కో నగరం నుంచి 80 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల నెలవారి ఆదాయం రూ.10వేల కంటే తక్కువగా ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.40లక్షల గ్రాంట్‌ను ముత్తూట్ వివాహసన్మానం ప్రాజెక్టుకు కేటాయించినట్లు సీఎస్ఆర్ హెడ్ బాబుజాన్ మలయిల్ తెలిపారు. డిసెంబర్ 25న సాయంత్రం 5.30గంటలోపు హిమాయత్‌నగర్‌లోని గ్రాండ్‌పాస్ రాయల్ మాన్షన్‌లో గల జోనల్ కార్యాలయం 3-6-2/1/1, 2వ అంతస్తులో గానీ లేదా 92880 03602 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడం లేదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ విమర్శించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. డిసెంబర్ 4 నుంచి 7 వరకు మిచౌంగ్ తుఫాన్‌తో రాష్ట్రంలో 4.75 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లి నదని, బాధిత రైతులకు రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, మాదినేని రమేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నద్యాల నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, శెట్టి వెంకన్న, కందాల ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



## ఫెర్నాండెజ్ ఆధ్వర్యంలో..ఔట్ పేషెంట్ క్లినిక్

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 19 : ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నెక్లెస్ రోడ్డులో నూతన ఔట్ పేషెంట్ క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ హాజరయ్యారు. హాస్పిటల్ సీఎండీ డా.ఎవిటా ఫెర్నాండెజ్, సీనియర్ కన్సల్టెంట్ పిడియాట్రిషియన్ డాక్టర్ గడ్డం ప్రమోద్ పాల్గొన్నారు.

# కబ్జాలను ఉపేక్షించకండి

- ఉన్నతాధికారులతో చేపట్టిన సమీక్షలో మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్
- పట్టణ ప్రణాళిక, ఎస్టేట్స్, ఓఆర్ఆర్‌లపై సమీక్ష



సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): భూముల పరిరక్షణ విషయంలో ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్‌గా సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టిన దాన కిశోర్ మంగళవారం అమీర్‌పేటలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) కార్యాలయంలో హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలితో కలిసి వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఎస్టేట్ విభాగం అధికారులతో హెచ్ఎండీఏకు సంబంధించిన భూముల వివరాలపై ఆరా తీశారు. ఇటీవల శంషాబాద్‌లోని భూములపై వెలువడిన కోర్టు తీర్పు వివరాలను, దాని పరిరక్షణకు తీసుకుంటున్న విషయాలను అధికారులు కమిషనర్‌కు వివరించారు. స్థానిక పోలీసుల సహకారం తీసుకొని హెచ్ఎండీఏకు చెందిన భూములు కబ్జాకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని కమిషనర్ దాన కిశోర్ సూచించారు. ముఖ్యంగా శంషాబాద్‌లోని హెచ్ఎండీఏకు చెందిన భూముల్లో ఉన్న కబ్జాలను వెంటనే తొలగించి, స్వాధీనం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

### ఓఆర్ఆర్ ప్రాజెక్టు అధికారులతో సుదీర్ఘ సమీక్ష..

ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ విభాగాల ఉన్నతాధికారులతో వేర్వేరుగా కమిషనర్ దాన కిశోర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టుకు సంబంధించిన ఉన్నతాధికారులతో మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిర్వహించారు. ఓఆర్ఆర్‌కు సంబంధించిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) కార్యకలాపాలు, ఓఆర్ఆర్ చుట్టూ ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టులు, ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులపైనా చర్చించినట్లు సమాచారం. మొత్తంగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రెండో రోజు నుంచే సుదీర్ఘంగా ఒక్కో విభాగం కార్యకలాపాలను సమీక్షించడంతో అధికారులను కొంత కలవరానికి గురి చేసింది. అదేవిధంగా హెచ్ఎండీఏ కీలక విభాగమైన పట్టణ ప్రణాళిక (ప్లానింగ్) విభాగం ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళికా విభాగంలోని డైరెక్టర్లు, ప్లానింగ్ ఆఫీసర్స్(పీఓ), అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్స్ (ఏపీఓ)లతో సమావేశమై భవన నిర్మాణ, లేఅవుట్ల అనుమతుల జారీ విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఎవరెవరు ఏ స్థాయి వరకు భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో నాలుగు జోన్లు శంకర్‌పల్లి , శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్‌లు ఉండగా, ఒక్కో దాని పరిధిలో అనుమతులు ఏవిధంగా ఉన్నాయి. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయని అధికారులతో చర్చించారు.

## ప్రభుత్వ దవాఖానల్లో సమయ పాలన పాటించాలి

జిల్లా వైద్యశాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మేడ్చల్, డిసెంబర్19(నమస్తే తెలంగాణ): జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యాధికారులు, సిబ్బంది తప్పకుండా సమయ పాలన పాటించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వైద్యశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారితో పాటు కింది స్థాయి అధికారులు సైతం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. దవాఖానల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వచ్చే వారం సమావేశం నిర్వహిస్తామని, పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యా, ఆరోగ్యశాఖ అధికారి రఘునాథస్వామి, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాంటినెంటల్‌లో అరుదైన క్యాన్సర్ శస్త్రచికిత్స

- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన వైద్యులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 19: దేశంలోనే మొదటిసారిగా క్యాన్యర్ రోగులకు రెండు అరుదైన శస్త్రచికిత్సలు కాంటినెంటల్ వైద్య బృందం విజయవంతంగా నిర్వహించిందని హాస్పిటల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. మంగళవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌కు విజయవంతంగా శస్త్రచికిత్సను అందించేందుకు అధునాతన చికిత్స విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కాంటినెంటల్ క్యాన్సర్ కేర్ సెంటర్ మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ సురేశ్ మాట్లాడుతూ.. అత్యంత ప్రమాదకరమైన గ్లియోబ్లాస్టోమా మెదడు క్యాన్సర్‌తో చాలా కాలంగా బాధపడుతున్న ఓ యువతికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశామని చెప్పారు. అధునాతన డెంట్రీటెక్ సెల్ థెరపీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. కాంటినెంటల్ క్యాన్యర్ కేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ 30 సంవత్సరాల ఓ యువతి పెండ్లి అయిన మూడు సంవత్సరాలకు పిల్లలు కలగడం లేదని కడుపులో పెద్ద కణితి ఉందని బాధపడుతూ కాంటినెంటల్‌కు రావడం జరిగిందన్నారు. కాంటినెంటల్ వైద్య బృందం 15 కిలోల కణితిని ఆమె కడుపులోంచి తొలగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటినెంటల్ న్యూరో సర్జన్ డాక్టర్ అజయ్ రెడ్డి తదితర వైద్యులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరిలో ఫార్ములా -ఈ పోటీలు

- సమీక్షించిన హెచ్ఎండీఏ కమిషనర్

సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ ఫార్ములా-ఈ పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా కొత్తగా నియమితులైన దాన కిశోర్ మంగళవారం అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో ఫార్ములా-ఈ పోటీలపై సమావేశం నిర్వహించారు. ఫార్ములా-ఈ పోటీల ఏర్పాట్లకు సంబంధించి కో ఆర్డినేటర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి సంతోష్‌తో పాటు చీఫ్ ఇంజనీర్ బీ.ఎల్.ఎన్.రెడ్డి, ఎస్.ఈ పరంజ్యోతితో పాటు పలువురు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో కమిషనర్ దాన కిశోర్ ప్రత్యేకంగా సమీక్షించారు. సమీక్ష అనంతరం హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వివరించారు.

## స్టార్టప్‌లకు ఆర్థిక మద్దతు

- కొత్తగా మొబైల్ యాప్‌ను ప్రారంభించిన లియో సంస్థ



సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను ప్రోత్సహించి పెట్టుబడులు పెట్టేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్(లియో) సీఈవో మోహ్నిష్ యెర్రా తెలిపారు. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్ రూపొందించిన మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. అనంతరం సీఈఓ మోహ్నిష్ యెర్రా మాట్లాడుతూ.. 2022లో స్థాపించిన లియో సంస్థలో ఇప్పటి వరకు 104 మంది సభ్యులుగా చేరారని, వీరందరి వ్యాపారాల విలువ సుమారు రూ.25వేల కోట్లు ఉంటుందన్నారు. లియో సంస్థ తరపున మాత్రమే కాకుండా తన సొంత సంస్థ అయిన మైక్యాప్ (మోహ్నిష్ యెర్రా కాపిటల్) ద్వారా ఇప్పటి వరకు 18 కంపెనీల్లో వ్యక్తిగత పెట్టుబడి పెట్టానని వెల్లడించారు.

## మాజీ మంత్రి సబితా రెడ్డి మానవత్వం



రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రాంతంలోని శ్రీశైలం ప్రధాన రహదారిపై మంగళవారం ఓ దివ్యాంగ వృద్ధుడు ఫిట్స్ వచ్చి గిలగిలా కొట్టుకుంటున్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ఆ వృద్ధుడిని గమనించి అతని దగ్గరికెళ్లారు. కారు దిగి స్వయంగా తన సిబ్బందితో కలిసి వృద్ధుడిని సాధారణ స్థితికి తెచ్చారు. అనంతరం వృద్ధుడి పూర్తి వివరాలు అడగగా.. తనది ఆమనగల్ అని, పేరు ఎల్లయ్య అని చెప్పాడు. అతనికి కొంత నగదు ఇచ్చి ఆటోలో పంపించి మానవత్వం చాటుకున్నారు.

– బడంగ్‌పేట